'వార్-2' ఆలస్యం?

హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రం 'వార్-2'. అయాన్ ముఖర్జీ దర్శకుడు. గూఢచారి థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్‌లో ఎన్టీఆర్ నటిస్తున్న తొలి స్ట్రెయిట్ చిత్రమిదే కావడంతో ఈ సినిమా గురించి ఆయన అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ఇదివరకే ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల ఆలస్యం కానున్నట్లు తెలిసింది. ఇటీవల పాట చిత్రీకరణ సందర్భంలో హృతిక్ రోషన్ గాయపడ్డట్లు తెలిసింది. దాంతో నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు డాక్టర్లు సూచించారట. ఈ నేపథ్యంలో ఈ సినిమా రిలీజ్ వాయిదా పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు. గత కొద్దిరోజులుగా ముంబయిలో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్‌లపై ఓ భారీ పాటను చిత్రీకరిస్తున్నారు. ఇందులో 500 మంది డ్యాన్సర్లు పాల్గొంటున్నారు. హృతిక్, ఎన్టీఆర్ ఇద్దరూ మంచి డ్యాన్సర్లు కావడంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. ఈ పాట షూటింగ్ సమయంలో హృతిక్ గాయపడ్డారని తెలిసింది. యష్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.

గద్దర్ అవార్డుల విధివిధానాలు ఖరారు

ఈ ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేయబోతున్న విషయం తెలిసిందే. ప్రతీ ఏడాది ఉగాది రోజున ఈ పురస్కారాలను అందజేస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులకు సంబంధించిన విధి విధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ సినిమా రంగానికి విశేష సేవలందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లపై ప్రత్యేక అవార్డులు ఇవ్వాలని, ప్రముఖ నటులు ఎం.ప్రభాకర్ రెడ్డి పేరుపై ఉన్న అవార్డును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 13వ తేదీ నుంచి అవార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తారు. 2014 నుంచి 2023 వరకు ఒక్కో ఏడాదికి ఉత్తమ చలన చిత్ర అవార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యతా చిత్రం, బాలల చిత్రం, పర్యావరణం, చారిత్రక సంపద తదితర విభాగాల్లో ఎంపిక చేసిన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయనున్నారు. వీటితో పాటు తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్ , షార్ట్‌ఫిల్మ్ విభాగాల్లో కూడా అవార్డులను అందించనున్నారు. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు రాసిన ఫిల్మ్ జర్నలిస్ట్‌లకు కూడా అవార్డులను అందజేస్తామని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో తొలిసారిగా ఉర్దూ భాషా చిత్రాలకు కూడా అవార్డులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సందీప్‌రెడ్డి షరతుల చిట్టా?

ఫౌజీ, ది రాజాసాబ్ సినిమాల షూటింగుల్లో అగ్రహీరో ప్రభాస్ బిజీగా ఉన్నారు. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' స్క్రిప్ట్, ప్రీప్రొడక్షన్ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ప్రభాస్ తాను చేస్తున్న రెండు సినిమాలను ముగించే వరకూ సందీప్‌రెడ్డి సైలెంట్‌గానే ఉంటారట. 'స్పిరిట్' లొకేషన్‌లోకి ప్రభాస్ ఎంట్రీ ఇచ్చాక, ఇక పూర్తిగా తన ఆధీనంలోనే ఉండాలనే షరతుని ప్రభాస్ ముందుంచారట సందీప్‌రెడ్డి వంగా. ఇంకా ప్రభాస్ ముందు ఆయన ఉంచిన షరతులు ఇలా ఉన్నాయి. ' 'స్పిరిట్' పూర్తయ్యే వరకూ మరో సినిమా చేయకూడదు. ఆ లుక్‌తో బయట కనిపించకూడదు. వారానికి ఒకరోజో, రెండ్రోజులో కాల్షీట్లు ఇస్తే కుదరదు.. బంచ్‌గా కాల్షీట్లు కావాలి. బాడీ డబుల్స్‌పై ఆధారపడి షాట్లు తీయను.. నా లొకేషన్‌లో డూప్ ప్రస్తావన రాకూడదు..' ఇవీ సందీప్‌రెడ్డి కండీషన్లు. హీరో అనేవాడు సందీప్‌రెడ్డి వంగాకి సరండర్ అయితే.. అతను ఎలాంటి అవుట్‌పుట్ ఇస్తాడో.. అర్జున్‌రెడ్డి, యానిమల్ సినిమాలు చెప్పేశాయి. అందుకే ప్రభాస్ కూడా 'సరే' అన్నారట. ప్రస్తుతం ఈ షరతుల చిట్టా ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నది. 'స్పిరిట్'లో ప్రభాస్ పవర్‌పుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. కరీనాకపూర్, సైఫ్ అలీ ఖాన్ దంపతులు ఇందులో విలన్లుగా నటిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది చివర్లోకానీ, 2027 ప్రథమార్ధంలోగానీ 'స్పిరిట్' విడుదలయ్యే అవకాశం ఉంది.

మూడోసారి ముచ్చటగా?

ఓ బేబీ సినిమాలను తెరకెక్కించిన లేడీ డైరెక్టర్ నందినీరెడ్డి ఇటీవలే సమంతకు ఓ కథ వినిపించారట. దానికి సామ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తున్నది. సమంత కెరీర్‌లోనే 'ఓ బేబీ'ని మెమరబుల్ మూవీ అని చెప్పొచ్చు. మరి ఈ సారి సమంతతో నందినీరెడ్డి ఎలాంటి సినిమా చేస్తారో చూడాలి.

విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'ఖుషి' తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయలేదు సమంత. తెలుగుతెరపై ఆమె పునరాగమనం కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు సామ్ టాలీవుడ్ రీఎంట్రీకి ముహూర్తం కుదిరినట్టు విశ్వసనీయ సమాచారం. సమంతతో జబర్దస్త్,

కాశీ నేపథ్యంలో మహేశ్ సినిమా?



మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న జంగిల్ అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. లార్జర్ దేన్ లైఫ్ కథాంశాలతో వెండితెరపై మ్యాజిక్ చేస్తుంటారు రాజమౌళి. ఈ నేపథ్యంలో ఈ సినిమా కథేమిటన్నది అందరిలో ఆసక్తిని పెంచుతున్నది. అమెజాన్ అడవుల నేపథ్యంలో ట్రెజర్ హంట్ కథాంశమిదని గతంలో వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఈ కథలో కాశీ నేపథ్యం కీలకంగా ఉంటుందని తెలిసింది. భారతీయ పురాణాలతో సంబంధం కలిగిన అడ్వెంచరస్ జర్నీగా రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. హనుమంతుడి స్ఫూర్తితో కథానాయకుడి పాత్రను తీర్చిదిద్దారని ప్రచారం జరుగుతున్నది. కాశీ నేపథ్య సన్నివేశాల కోసం హైదరాబాద్‌లో కాశీ పట్టణాన్ని తలపించేలా సెట్స్ నిర్మాణం జరుగుతున్నదని తెలుస్తున్నది. మైథాలజీ, హిస్టరీలతో కూడిన అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రాజమౌళి ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఒడిశాలోని కోరాపుట్ పర్వతపంక్తుల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలోఉంది.

రెట్టింపు వినోదం పక్కా

'ఈ సినిమా విజయంపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. ఈ నెల 30న నా పుట్టిన రోజు. సినిమా 28వ తేదీన వస్తున్నది. ఈ సినిమాతో దర్శకుడు వెంకీ నాకు బర్త్‌డే గిఫ్ట్ ఇవ్వబోతున్నారు' అని అన్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన తాజా చిత్రం 'రాబిన్‌హుడ్' ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు. నితిన్ మాట్లాడుతూ.. 'భీష్మ' కంటే డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారంటీ అని, అందరూ పొట్టచెక్కలయ్యేలా నవ్వుకుంటారని, ఎక్కడా అసభ్యత లేకుండా క్లీన్ కామెడీతో ఆకట్టుకుంటుందని చెప్పారు. తప్పకుండా బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టబోతున్నామని దర్శకుడు తెలిపారు. ఇప్పటివరకు విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, చక్కటి వినోదంతో ఉన్నత నిర్మాణ విలువలతో మెప్పిస్తుందని నిర్మాత వై.రవిశంకర్ అన్నారు. సినిమాలో తాను మీరా అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, అందరిని నవ్విస్తానని కథానాయిక శ్రీలీల చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

లవ్‌లోని మ్యాజికల్ మూమెంట్సే దిల్ రూబా

'నిన్ననే ఫైనల్ చూసుకున్నాం. ఔట్ పుట్ చూశాక చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. స్త్రీలు గౌరవంగా ఫీలయ్యేలా సినిమా ఉంటుంది. అన్ని వర్గాలకూ నచ్చే సినిమా ఇది.' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన న్యూ ఏజ్ కమర్షియల్ మూవీ 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకుడు. రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి, సారెగమ నిర్మాతలు. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం కిరణ్ అబ్బవరం విలేకరులతో ముచ్చటించారు. '2గంటల 20నిమిషాల మూవీలో ఎక్కడా బోర్ ఫీలవ్వలేదు. ఓ మంచి సినిమా చూశామనే ఫీల్‌తో థియేటర్ నుంచి బయకు వస్తారు.' అని చెప్పారు కిరణ్ అబ్బవరం. ఇంకా మాట్లాడుతూ 'ఈ సినిమాలో కొత్తగా ఏం ఎక్స్‌పెక్ట్ చేయొద్దని చెప్పడానికే ప్రెస్‌మీట్‌లో కథను రివీల్ చేశాం. లవ్‌లోని మ్యాజికల్ మూమెంట్స్ ఎంజాయ్ చేయడానికి మాత్రమే ఈ సినిమాకు రండి. ఇప్పటిదాకా సినిమాల్లో ఎక్స్ లవర్ వల్ల గొడవలు జరగడం కామెడీగా చూపించారు. కానీ ఇందులో ఎక్స్ లవర్‌తోనూ స్నేహాన్ని షేర్ చేసుకోవచ్చు, మోరల్ సపోర్ట్ ఇవ్వొచ్చనే మంచి పాయింట్‌ని చూపించాం. ఇందులో నేను చేసిన సిద్ధు పాత్ర క్యారెక్టరైజేషన్ అందరికీ నచ్చుతుంది. సారీ, థ్యాంక్స్ అనే మాటలు ఎలా పడితే అలా వాడేయకూడదు. వాటికి ఓ విలువ అనేది ఉంది.. అనేది హీరో వెర్షన్. తను అనవసరంగా సారీలు, థ్యాంక్సులు చెప్పడు. ఇలాంటి క్యారెక్టర్‌ని ఇప్పటివరకూ నేను చేయలేదు. ఇందులో నేను కొత్తగా కనిపిస్తా.' అని తెలిపారు కిరణ్ అబ్బవరం.

విజువల్ వండర్‌గా 'షణ్ముఖ'

ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకుడు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది సాయికుమార్ మాట్లాడుతూ 'విడుదలకు ముందే ఈ సినిమా అన్ని భాషల డిజిటల్, శాటిలైట్, థియేట్రికల్ హక్కులు ఫ్యాన్సీ రేటుకు అమ్ముడుపోవడం ఆనందంగా ఉంది. కుటుంబ సమేతంగా చూడదగిన డివోషనల్ థ్రిల్లర్ ఇది' అన్నారు. తన కెరీర్‌లో ఇదొక ప్రత్యేక చిత్రమని, విభిన్నమైన పాత్రలో కనిపిస్తానని అవికా గోర్ తెలిపింది. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని వినూత్నమైన పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, విజువల్ వండర్‌లా ఆకట్టుకుంటుందని దర్శకనిర్మాత షణ్ముగం సాప్పని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: తులసీరామ్, షణ్ముగం, రమేష్ యాదవ్, దర్శకత్వం: షణ్ముగం సాప్పని.

సాయికుమార్‌కి కుమ్రంభీం అవార్డు

నటుడిగా స్వర్ణోత్సవం జరుపుకుంటున్న డైలాగ్ కింగ్ సాయికుమార్‌కు 2024వ సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన కుమ్రంభీం జాతీయ పురస్కారం వరించింది. ఈ విషయాన్ని సెలక్షన్ చైర్మన్ సి.పార్థసారథి ఐఏఎస్, కో-ఛైర్మన్ నాగబాల డి.సురేష్‌కుమార్‌లతో కూడిన కమిటీ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేసింది. గత 12 ఏండ్లుగా భారత కల్చరల్ అకాడమి, ఓం సాయితేజ ఆర్ట్స్, ఆదివాసి సాంస్కృతిక పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ అవార్డు అందిస్తున్నామని, గతంలో ఈ అవార్డును గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ, అల్లాణి శ్రీధర్, డా.రాజేంద్రప్రసాద్, గూడ అంజయ్యలకు అందించామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 23న కొమరంభీమ్ జిల్లా, అసిఫాబాద్‌లోని ప్రమీలా గార్డెన్స్‌లో పురస్కార మహోత్సవం జరగుతుందని, ప్రముఖ రాజకీయ, సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వారు తెలియజేశారు.

చౌర్యపాఠం ఓ సరదా ప్రయాణం

దర్శకుడు నక్కిన త్రినాథరావు నిర్మిస్తున్న క్రైమ్ కామెడీ డ్రామా 'చౌర్య పాఠం'. నిఖిల్ గొల్లమారి దర్శకుడు. ఇంద్ర రామ్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఏప్రిల్ 18న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. హీరో నాగచైతన్య ఈ టీజర్‌ని లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. థ్రిల్లింగ్ క్రైమ్ ఎలిమెంట్స్‌తో.. డార్క్ హ్యూమర్ బ్లెండ్‌తో టీజర్ ఆసక్తికరంగా సాగింది. ఒక సరదా ప్రయాణంలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, మస్త్ అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, సంగీతం: దేవ్ జాంద్, సహ నిర్మాత: చూడామణి, నిర్మాణం: నక్కిన నరేటివ్.

డ్రగ్స్‌పై పోరు సాగించే 'అభినవ్'

స్వీయ దర్శకనిర్మాణంలో భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందించిన బాలల చిత్రం 'అభినవ్- 'చేజ్డ్ పద్మ వ్యూహ'. మంగళవారం ఈ చిత్ర పోస్టర్, ట్రైలర్‌ను ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, మాదకద్రవ్యాల మాఫియాను అణిచివేయాలనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తీశామని దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ తెలిపారు. సమాజశ్రేయస్సు కోసం ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఈ సినిమాను తెరకెక్కించామని, అతి త్వరలో నూన్‌షోగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని ఆయన తెలిపారు. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వందేమాతరం శ్రీనివాస్.

మూలాలు మరచిపోతున్నారేమో!?



విజయాల విషయంలో బాలీవుడ్ ఈ మధ్య కాలంలో వెనుకపడ్డ మాట వాస్తవం. స్త్రీ2, ఛావా లాంటి అరుదైన మెరుపులు కూడా అప్పుడప్పుడే తారసపడుతున్నాయి. ఇటీవల జరిగిన ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సీనియర్ బాలీవుడ్ రచయిత జావేద్ అక్తర్ ఈ విషయంపై మాట్లాడారు. 'గతంతో పోలిస్తే బాలీవుడ్ సినిమాలకు హిందీ ప్రేక్షకులు పెద్దగా కనెక్ట్ కాలేకపోతున్నారు. ముక్కూ మొహం తెలియని దక్షిణాది హీరోల సినిమాలు ఇక్కడ వందలకోట్లు వసూలు చేస్తున్నాయి. బాలీవుడ్ సినిమాలు ఇలా వెనుకబడటంపై మీ అభిప్రాయం ఏంటి?'అని అదే వేడుకలో పాల్గొన్న బాలీవుడ్ అగ్ర నటుడు ఆమిర్‌ఖాన్‌ను జావెద్ ప్రశ్నించారు. దీనిపై ఆమిర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులకు వినోదాన్ని అందించడంలో హిందీ రచయితలు, దర్శకులు కాస్త ఎక్కువ స్వేచ్ఛ తీసుకుంటున్నారేమో!?. శ్రుతిమించిన శ్రద్ధతో మూలాలు మరిచిపోతున్నారేమో!?. భావోద్వేగాలను మిళితం చేయడంలో, జీవితాల్లోని వివిధ కోణాలను స్పృశించడంలో మనం వెనుకబడుతున్నామేమో!?. నావరకూ నా మనసులోతుల్లో ఏది అనిపిస్తే అదే చేస్తా. హిట్ ఫ్లాపుల గురించి అస్సలు ఆలోచించను. ప్రతి దానికీ హంగులు, రంగులు దిద్దాల్సిన పని లేదు. కథ, కథనాలపై దృష్టి పెడితే చాలు. కచ్చితంగా సినిమా బాగా వస్తుంది. ' అని కరాఖండీగా చెప్పారు ఆమిర్‌ఖాన్. ఇంకా మాట్లాడుతూ 'సినిమాకు ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేదు. అది అసలు సమస్యే కాదు. మనం అవలంభిస్తున్న బిజినెస్ మోడలే ఈ తిరోగమనానికి కారణమని నా అభిప్రాయం. 'మా సినిమాను దయచేసి చూడండి.. ఒకవేళ చూడకపోతే ఎనిమిది వారాల తర్వాత మేమే మీ ఇంటికి పంపిస్తాం' అని రెండు ఆప్షన్లు ఆడియన్స్‌కి మనం ఇస్తున్నాం. వాళ్లు ఎంచక్కా ఎనిమిది వారాల తర్వాతే ఇంట్లో (ఓటీటీ) సినిమా చూస్తున్నారు. అసలు ఒకే ఉత్పత్తిని రెండుసార్లు విక్రయించడం అనే ప్రక్రియ వల్ల తలెత్తుతున్న సమస్యలివన్నీ. నాకు వేరే ఆప్షన్ లేకపోతే నేను కచ్చితంగా థియేటర్‌కే వస్తా. అంతేకాదు, ప్రస్తుతం ప్రేక్షకుడు సినిమాను ఎక్కడ్నుంచైనా చూడొచ్చు. ఇక థియేటర్లకు వెళ్లాల్సిన పనేముంది? మన బిజినెస్ మోడల్‌తో మనమే మన సినిమాలను చంపుకుంటున్నాం.' అంటూ వెల్లడించారు ఆమిర్‌ఖాన్.